# 'ప్రజానాయకుడు' నాటక ప్రదర్శన

**ఆంధ్రభూమి సాంస్కృతిక ప్రతినిధి**

హైదరాబాద్, ఆగస్టు 23: రసరంజని ఆధ్వర్యంలో ప్రఖ్యాత స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజానాయకుడు, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం జీవితకథ ఆధారంగా ప్రజానాయకుడు అన్న పేరుతో మొదలి నాగభూషణశర్మ రచించి దర్శకత్వం వహించిన నాటకం ప్రదర్శించబడింది. ప్రకాశంపంతులు బాల్యంలో పడ్డ కష్టాలను ఫ్లాష్‌బ్యాక్‌గా ఇందులో చిత్రించారు. నిరుపేద కుటుంబానికి చెందిన ప్రకాశం తల్లి మిత్రుడైన భర్త కోరికను తీర్చడానికి పూటకూళ్ల ఇల్లు నడుపుతూ ప్రకాశం పంతుల్ని అతి కష్టంమీద చదివించడంతో ప్రారంభమై ప్రకాశం పంతులికి అన్నివిధాల ఆప్యాయంగా ఆదరించి ప్రోత్సహించిన హనుమంతురావునాయుడిగారి ఔదార్యాన్ని, రాజమండ్రిలో ఆయనతో కలిసి నాటకాలు వేసిన ప్రకాశం జీవితాన్ని శతాబ్ద ప్రారంభంలో వందేమాతరం ఉద్యమంద్వారా ఎలా స్ఫూర్తి పొందిందీ, అందరి ప్రోత్సాహంపై బార్ ఎట్ లా చదవడానికి లండన్ వెళ్లడం, తిరిగి వచ్చి మద్రాసులో లాయర్‌గా ధనార్జన చేయడం గాంధీగారి పిలుపునుసరించి స్వాతంత్ర్య సమరంలో దూకడం, ఆయన ఎదుర్కొన్న సమస్యలు, ప్రకటించిన దేశభక్తి సైమన్ కమిషన్ రాకను వ్యతిరేకిస్తూ ఆయన ప్రదర్శించిన ధైర్య శౌర్యాలను వివరిస్తూ సన్నివేశాలు నడిచాయి. ఈ సన్నివేశాల్లో తల్లికి సంబంధించిన, హనుమంతరావునాయుడికి సంబంధించిన సంఘటనలన్నీ బాగా పండాయి. అందుకు కారణం ఆ సంఘటనల్లో ప్రేక్షకులు తమని తాము ఐడెంటిఫై చేసుకోవడం. ప్రకాశం జీవితం ఆరంభంనుంచీ చివరిదాకా పోరాటాల మయం. వాటిలో నాటకీయత పుష్కలంగా ఉంది. ఆంధ్ర రాజకీయాలు, రాజాజీతో స్పర్థ మొదలైన ఘట్టాల్లో ఈ నాటకీయతకన్నా ఉపన్యాసాలు, ఆవేశాల పాలు ఎక్కువ కావడంవల్ల నాటకీయత తగ్గిపోయింది. తల్లి మరణ ఘట్టం ప్రేక్షకుల హృదయాన్ని రసానుభూతితో నింపింది. సైమన్ కమిషన్ ఘట్టం, క్విట్ ఇండియా ఘట్టంలో ప్రవేశపెట్టిన పాటలు నాటక గమనానికి అడ్డం పడ్డాయి. చివరలో ప్రకాశం మరణాన్ని వ్యాఖ్యాత వివరించే సందర్భంలో ఆయన ఛాయామూర్తి అలా అలా నడిచి వెళ్లడం నాటకం రక్తికి తోడ్పడింది. ప్రకాశం తల్లిగా నటించిన బొర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి, హనుమంతరావునాయుడుగా నటించిన దుగ్గిరాల సోమేశ్వరరావు పాత్రలకు న్యాయం చేశారు.